క్లుప్తంగా

చట్టాలపై అవగాహన తప్పనిసరి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న హనుమంతరావు

సంగారెడ్డి టౌన్: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార కార్యదర్శి హనుమంతరావు అన్నారు. శుక్రవారం సంగారెడ్డిలోని సఖి కేంద్రంలో మహిళ, బాలల చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహహింస, వర కట్న నిరోధక చట్టం, కుటుంబ, వివాహ తగాదాలపై అవగాహన ఉండాలన్నారు. ఎవరైనా వారి హక్కులకు భంగం కలిగించినట్టయితే న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని సూచించారు. అదేవిధంగా బాలలకు న్యాయపరమైన సేవలు అందిస్తామన్నారు. అనంతరం న్యాయ సేవా సంస్థ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖి కేంద్రం లీగల్ కౌన్సిలర్ నీలిమ, మహిళా వికాస కేంద్రం పర్యవేక్షకురాలు సుగుణ, సిబ్బంది పాల్గొన్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణఖేడ్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తపస్ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమ జాగరణలో భాగంగా ఈ నెల 19న ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న మహాధర్నా వాల్‌పోస్టర్‌ను ఖేడ్ ఎమ్మార్సీ ఎదుట గురువారం ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్, మల్లికార్జున్, ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు చంద్రకాంత్, జిల్లా, డివిజన్ బాధ్యులు లక్ష్మణ్, చంద్రశేఖర్, నందప్ప, జగదీష్, రతన్‌సింగ్, కిషన్, ప్రతాప్, సతీష్, వెంకటేశం, గంగారాం, లింగయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు వర్క్‌షీట్లు పంపిణీ

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆత్మకూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం మండల విద్యాధికారి దండు అంజయ్య వర్క్‌షీట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ వర్క్‌షీట్లతో విద్యార్థులు సులభంగా విద్యను నేర్చుకుంటారన్నారు. మండలంలోని 53 పాఠశాలలకు చెందిన 4125 మంది విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లం విషయాలలో ఒక్కో విద్యార్థికి 3 చొప్పున వర్క్‌షీట్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుమాలిని, రజిని, అశ్వాక్, సీఆర్పీలు రాజేశ్వర్, నిరంజన్, కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పరిధిలోని సిద్దాపూర్‌లో చేపట్టిన రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు లేకుండా త్వరితగతిన పనులు పూర్తిచేయాలని సదరు కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఇంజనీర్ రాజేష్, కౌన్సిలర్ గుండు రవి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

కొండాపూర్(సంగారెడ్డి): మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 5 నెలల వేతనాలను చెల్లించాలని కోరుతూ గురువారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు మాట్లాడుతూ మిషన్ భగీరథలో భాగంగా జీకేఆర్ సంస్థలో పనిచేస్తున్న కార్మికులకు 5 నెలలుగా వేతనాలు అందకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో బకాయి వేతనాలు చెల్లించనిపక్షంలో మిషన్ భగీరథ నీటి సరఫరా బంద్ చేసి పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మిషన్‌భగీరథ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా సహకార కార్యదర్శి విద్యాసాగర్, కార్మికులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం



వీరభద్రస్వామి



భద్రకాళి అమ్మవారు



అమ్మవార్లకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది

- నెలరోజుల పాటు జాతర
- ముస్తాబైన వీరభద్రుడి ఆలయం
- ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

జిన్నారం(పటాన్‌చెరు): శైవక్షేత్రాల్లో ఒకటైన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయం శ్రావణమాసం లక్షబిల్వార్చన ఉత్సవాల సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్లకు భక్తులు ప్రతి సంవత్సరం నెల రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. స్వామివార్లను దర్శించుకునేందుకు ఆయా రాష్ట్రాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు.

గుమ్మడిదల మండలంలోని వీరన్నగూడెం(బొంతపల్లి) గ్రామంలోని భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయంలో శ్రావణమాస లక్షబిల్వార్చన ఉత్సవాలు గురువారం నుంచి అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు స్వామివారి సన్నిధిలో ఆలయ ఈఓ శశిధర్, ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ చైర్మన్‌లు శ్రీనివాస్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, విజయభాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మమత, నాయకులు వేణు, లక్ష్మీనారాయణ, చక్రపాణి తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పోటెత్తిన భక్తజనం..

నెలరోజుల పాటు స్వామివారి సన్నిధిలో ఉత్సవాలను నిర్వహించనుండటంతో దేవాదాయశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. మొదటి రోజు స్వామివారిని దర్శించుకనేందుకు భక్తులు బారులు తీరారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో పాటు హైదరాబాద్, ఇతర జిల్లాల నుంచి భారీగా స్వామివారిని శ్రావణమాసంలో దర్శించుకుంటారు. ఇందుకోసం దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో పూజలు

కోహీర్(జహీరాబాద్): శ్రావణ మాసోత్సవాలను పురస్కరించుకొని బడంపేట రాచన్నస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన ఉత్సవాలు ఘనంగా ప్రారంభమైయ్యాయి. మొదటిరోజు భక్తులు స్వామివారికి 4,100 బిల్వ పత్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యనిర్వాహణ అధికారి శివరుద్రప్ప, ఆలయ పాలక మండలి మాజీ సభ్యులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



నెల రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. భక్తులు అధికసంఖ్యలో హాజరై అమ్మవార్లను దర్శించుకోవాలని కోరుతున్నాం. ఆలయం వద్ద తాగునీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నాం. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

– శశిధర్, ఆలయ ఈఓ

సర్కార్ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం

- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): సర్కార్ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండలంలోని అన్నారం, అనంతారం, దోమడుగు, గుమ్మడిదల గ్రామాల్లో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య ఉపకేంద్రాల భవన నిర్మాణాలకు గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే లక్ష్యంతో వైద్య ఉపకేంద్రాలను ఏర్పాటు చేయించేవిధంగా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన డయాగ్నొస్టిక్ కేంద్రంలో అందించే అన్ని రకాల వైద్య పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పటాన్‌చెరులో రూ.200 కోట్లతో నిర్మిస్తున్న సూపర్ మల్టిస్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని వివరించారు. అనంతరం అన్నారంలో తన సొంత నిధులతో ఏర్పాటు చేయిస్తున్న శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రవీణ, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



అన్నారంలో ఉపకేంద్రం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం

- ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: గ్రామాలు, గిరిజన తండాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని అల్లాపూర్ పంచాయతీ పరిధిలోని మల్పరేగడి తండాలో రూ.20లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను గురువారం ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఏక్‌నాథ్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు దశలవారీగా నిధులు మంజూరు చేసి ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దుతామని వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీబాయి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు నవాబ్, రమేష్ చౌహాన్, రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఖేడ్ పట్టణ శివారులోని కాశీనాథ్ ఆలయం భూమిలో నిర్మించనున్న కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్ ఆశ్రమ నిర్మాణానికి కరణ్ గజేంద్ర భారతీ మహారాజ్ ఆశ్రమ నిర్మాణానికి గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు పూర్ణకుంభంతో ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో ఏకాంబ పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతీ మహారాజ్, మున్సిపల్ చైర్‌పర్సన్ రుబీనానజీబ్, వైస్‌చైర్మన్ పరశురాం, జెడ్పీటీసీ లక్ష్మీబాయి, సిర్గాపూర్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్ మాజీద్, అంబదాస్, నగేష్, బాసిత్, భక్తమండలి సభ్యులు వెంకటరమణారెడ్డి, సంజీవ్, నర్సింహులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కమ్యూనిటీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

కల్హేర్(నారాయణఖేడ్): సిర్గాపూర్ మండలం చందర్‌నాయక్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని దేవిసింగ్ మహరాజు తండాలో రూ.5 లక్షలతో కమ్యూనిటీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంబీఆర్ ఫౌండేషన్ చైర్మన్ రోషన్‌రెడ్డి, సర్పంచ్ సంతోషి, నాయకులు రాంసింగ్, వెంకట్‌నాయక్, పూల్‌సింగ్, లక్ష్మణ్, దేవిదాస్, మారుతి, గోపాల్, అంబాజీ, తుకరాం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దాం



లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

- ఎమ్మెల్యే మాణిక్‌రావు
- యువతకు లెర్నింగ్ లైసెన్స్‌లు పంపిణీ

జహీరాబాద్: రోడ్డు రవాణా నియమ, నిబంధనలను పాటిస్తూ రోడ్డు ప్రమాద రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. గురువారం క్యాంపు కార్యాలయంలో పలువురు వాహనదారులకు లెర్నింగ్ లైసెన్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా లైసెన్సులు తీసుకునే విషయంలో యువత ఆసక్తి చూపలేకపోతున్నారని, వాహనాలు నడిపే ప్రతివ్యక్తి వద్ద లైసెన్సు ఉండాలనే లక్ష్యంతో సొంతఖర్చుతో డ్రైవింగ్ లైసెన్సులు ఇప్పిస్తున్నామన్నారు. లైసెన్సులు రానివారు నిరాశ పడవద్దని, త్వరలో ప్రతిఒక్కరికీ అందజేస్తామని తెలిపారు. ఇప్పటివరకు 600 మందికి పైగా లైసెన్సుల కోసం దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఇప్పపల్లి సర్పంచ్ సురేష్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంల వినూత్న నిరసన

కొండాపూర్(సంగారెడ్డి): ఏఎన్ఎంలను రెగ్యూలర్ చేయాలని కోరుతూ గురువారం సంగారెడ్డిలోని డీఎంహెచ్ఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మెడికల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి మాట్లాడుతూ 20ఏళ్లుగా పనిచేసిన ఏఎన్ఎంలకు పరీక్షలు రాసి సెలెక్ట్ కావాలని ప్రభుత్వ విధించిన షరతులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో ఏఎన్ఎంలు ప్రాణాలకు తెగించి పనిచేసిన విషయాన్ని ప్రభుత్వం మరిచిపోవద్దన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలు వెంటనే పర్మినెంట్ చేయాలని, ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించేవరకు సమ్మెను కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు సంగీత, మాధవి, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..



మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్ఎంలు

జహీరాబాద్ టౌన్: కాంట్రాక్టు పద్ధతిన పనిచేస్తున్న తమను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ సెకండ్ ఏఎన్ఎంలు తహసీల్దార్ కార్యాలయం వద్ద సమ్మెకు దిగారు. సమ్మెకు పలువురు కార్మిక నాయకులు సంఘీభావం తెలిపారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మహిపాల్, ఏఎన్ఎం యూనియన్ నాయకులు లక్ష్మి, ఎలిషా పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం



రఘునాథరెడ్డి (ఫైల్)

జిన్నారం(పటాన్‌చెరు): విధుల్లోకి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. ఈ సంఘటన మండల పరిధిలోని బొల్లారంలో గురువారం చోటుచేసుకుంది. సీఐ నయిమొద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. వంగ రఘునాథరెడ్డి ఎయిర్‌టెల్ లిమిటెడ్‌లో కొన్నేళ్లుగా ఆఫీస్‌బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. బుధవారం ఉదయం ఎప్పటిలాగే విధుల్లోకి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో ఆయన కుటుంబసభ్యులు ఆఫీస్‌కు కాల్ చేస్తే విధుల్లోకి రాలేదని చెప్పగా స్నేహితులకు, బంధువుల వద్ద ఆరా తీయగా రఘునాథరెడ్డి ఆచూకీ లభించలేదు. రఘునాథరెడ్డి తండ్రి నర్సారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మరోచోట బాలిక..

పటాన్‌చెరు టౌన్: బాలిక అదృశ్యమైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాలిక తల్లి, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమీన్‌పూర్ పరిధిలోని లింగమయ్య కాలనీకి చెందిన బాలిక(15) 10వ తరగతి చదువుతోంది. కాగా బుధవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు ఎంత వెతికినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: మండలంలోనినిమ్లిమేట్ పంచాయతీ పరిధిలోని నన్యానాయక్‌తండాకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రవినాయక్, రమేష్ నాయక్ తదితరులు గురువారం మాజీ ఎంపీ, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు సురేశ్ షెట్కార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు తాహెర్, నాయకులు శంకర్‌నాయక్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

సంగారెడ్డి మున్సిపాలిటీ: ఆందోల్ నియోజకవర్గంలోని చౌటకుర్ సర్పంచ్ వీరమని మొగులయ్యతో పాటు కురుమ సంఘం నుంచి 25 మంది ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ సమక్షంలో గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శివకుమార్, చౌటకూర్ కురుమ సంఘం అధ్యక్షుడు రవి, నాయకులు వీరయ్య, అంజయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీలో గురువారం 19వ తిరుమల మహాపాదయాత్ర వాల్‌పోస్టర్‌ను వేంకటేశ్వర భక్తబృందం నిర్వాహకులు, సీసాల రాజు ముదిరాజ్, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆగస్టు 21వ తేదీన పట్టణంలోని మహంకాళి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 20 మంది సభ్యులతో కలిసి కాలినడకన తిరుమల తిరుపతికి బయలుదేరుతామన్నారు. వేంకటేశ్వరస్వామి భక్తబృందం సభ్యులు కొండల్‌రెడ్డి, రాజశేఖర్, అనిల్, అంబయ్య, నాయక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మునిపల్లి(అందోల్): సీఎంఆర్ఎఫ్ (ఎల్ఓసీ) చెక్కులను మాజీ ఎంపీపీ చంద్రయ్య, బీఆర్ఎస్ యూవత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికుమార్ చేతుల మీదుగా గురువారం జడ్పీటీసీ కార్యాలయంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ నాయకులు శివకుమార్ పాల్గొన్నారు.

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన పల్లె శేఖర్ అనారోగ్యానికి గురై ఇటీవల మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులకు రూ.60వేల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కును గురువారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్‌గుప్తా అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విశ్వేశ్వర్, హరీష్ యాదవ్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ సర్వాయి జయంతిని విజయవంతం చేయాలి

సంగారెడ్డి టౌన్: ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, అనధికారులు, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

◆ ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన

కొండాపూర్(సంగారెడ్డి): బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం కొండాపూర్, సంగారెడ్డి తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ వైఫల్యాలపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొండాపూర్, సంగారెడ్డి పట్టణ అధ్యక్షుడు సాయికుమార్, రవిశంకర్ మాట్లాడుతూ హామీల అమలులో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మల్లేశం, రవీందర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు సత్యమ్మ పాల్గొన్నారు.

◆ బీజేపీ నేతల ధర్నా

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆనంద్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ చేపట్టి మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను వర్తింప జేయటంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కౌన్సిలర్‌లు సాయికిరణ్‌రెడ్డి, శ్రీకాంత్, నాయకులు రవీందర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలం

సదాశివపేట(సంగారెడ్డి): సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందని బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు శ్రీనివాస్, అంబదాస్ అన్నారు. ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ నాయకులు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి పథకాల ఎంపికలో అర్హులైన వారికి కాకుండా బీఆర్ఎస్‌కు చెందిన వారినే ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ, మండల నాయకులు సతీష్, గంగయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ రీడింగ్ స్కిల్స్‌పెంపొందించాలి

కంగ్టి(నారాయణఖేడ్): ప్రాథమిక పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో రీడింగ్ స్కిల్స్ పెంపొందించాలని ఎంఈఓ శంకర్ అన్నారు. మండల పరిధిలోని బోజ్యా నాయక్‌తండా ప్రాథమిక పాఠశాలను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను గుర్తించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

◆ చిరుధాన్యాల దుకాణం ప్రారంభం

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని మల్గిలో డీడీఎస్ సంఘం దుకాణం(చిరుధాన్యాలు)ను గురువారం శాస్త్రవేత్త లక్ష్మణ్ సర్పంచ్ మారుతియాదవ్‌తో కలసి ప్రారంభించారు. నాయకులు శ్రీపతి, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

◆ సర్వాయి జయంతిని విజయవంతం చేయాలి

సంగారెడ్డిటౌన్: సంగారెడ్డి పట్టణంలో నేడు నిర్వహించే సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని విజయవంతం చేయాలని గౌడ సంఘం, కల్లు గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగరాజుగౌడ్, ఆశన్నగౌడ్ కోరారు. గురువారం సంగారెడ్డి మండల కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో సర్వాయి జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి అధినేత స్వామిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, వర్కింగ్ ప్రసిడెంట్ జంగన్నగౌడ్, నాయకులు ప్రభుగౌడ్, ప్రతాప్‌గౌడ్, హరీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

◆ అర్హులకే దళితబంధు ఇవ్వాలి

నారాయణఖేడ్: అర్హులైన దళితులను గుర్తించి దళిత బంధు పథకానికి ఎంపిక చేయాలని కోరుతూ మనూరు మండల ఎన్‌జి హుక్రాన గ్రామ దళితులు గురువారం ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ బీఆర్ఎస్ నాయకులు పేదలకు కాకుండా తమ అనుచరులనే దళితబంధుకు ఎంపిక చేసి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాబితా ఇచ్చారని ఆరోపించారు. అధికారులు గ్రామసభ నిర్వహించి అర్హులైన దళితులను ఎంపిక చేయాలని కోరారు.

◆ రుణమాఫీ వివరాలను ప్రదర్శించాలి

నారాయణఖేడ్: వ్యవసాయ రుణమాఫీ లబ్దిదారుల వివరాలను సంబంధిత బ్యాంకుల వద్ద నోటీసు బోర్డులపై ప్రదర్శించాలని అంబేడ్కర్, పూలే సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్ రహీం డిమాండ్ చేశారు. నారాయణఖేడ్‌లోని సంఘం కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేస్తూ సంబంధిత రైతుల పంటరుణ ఖాతాల్లో జమచేసినట్లు ప్రభుత్వం ప్రకటిస్తుండగా ఖాతాల్లో జమైనదీ లేనిదీ తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారని వాపోయారు. సాధారణ ఎన్నికల సమయంలో నాలుగేళ్ల కిందట రూ.లక్ష వరకు ఉన్న రుణాన్ని మాఫీ చేస్తామని ప్రకటించగా ఇప్పటివరకు వడ్డీతో కలిపి రెండు, మూడింతలు పెరిగి రూ.లక్ష మాఫీ చేసినా వడ్డీకి సరిపోయి రుణ బకాయిలు అలాగే ఉంటాయన్నారు. ప్రభుత్వం స్పందించి కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పండరి, నాయకులు భీంసేన పాల్గొన్నారు.

◆ విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మల్లారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం సర్పంచ్ శివజ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్, పుస్తకాలు, పలుకలను అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

◆ కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం

పటాన్‌చెరు టౌన్: కాలనీల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నట్లు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ తెలిపారు. గురువారం పట్టణంలోని సాయిరామ్‌నగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు విద్యుత్, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని విన్నవించగా స్పందించిన కార్పొరేటర్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

◆ బైక్, కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

పుల్‌కల్(అందోల్): అతివేగంగా వస్తున్న కారు అదుపుతప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలైయ్యాయి. ఈ ఘటన పుల్‌కల్ రైస్‌మిల్ వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పుల్‌కల్ గ్రామానికి చెందిన యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బచ్చమోల్ల ఉదయ్ కుమార్, గొల్ల వీరేశం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు అతివేగంగా వచ్చి వీరి బైక్‌ను ఢీకొట్టడంతో ఉదయ్‌కుమార్, వీరేశంకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ఆస్పత్రికి తరలించారు.

◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శాంతినగర్‌లోని 11వ వార్డులో గురువారం సీసీ రోడ్ల పనులను మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ నాయకులు రాములు నేత, తులసీదాస్ గుప్తా గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

◆ వాహనాల తనిఖీ

నారాయణఖేడ్: నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేట్ వాహనాలు ప్రయాణికులను తరలిస్తుండటంతో ఆర్టీసీ ఆదాయానికి గండిపడుతోందని నారాయణఖేడ్ ఆర్టీసీ డీఎం మల్లేశయ్య తెలిపారు. ఈ మేరకు జహీరాబాద్ ఎంవీఐ లావణ్య నారాయణఖేడ్‌లో గురువారం ఆర్టీసీ అధికారులు, సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తున్న వాహనదారులకు జరిమానా విధించారు.

◆ శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్ కాలనీ 8వ బ్లాక్‌లో కార్పొరేటర్ పుష్పనగేష్ గురువారం డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనేక ఏళ్లుగా ఇక్కడ ప్రజలు డ్రైనేజీ సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దాన్ని దృష్టిలో డ్రైనేజీ పనులు ప్రారంభించినట్టు తెలిపారు.